క్లుప్తంగా

నేడు పాతయింజరంలో గడప గడపకూ..

ఐ.పోలవరం: పాతయింజరం గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తారని చెప్పారు. పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఐ.పోలవరం: మురమళ్ల శరభయ్య చెరువు వద్ద ఉన్న సీతారామాంజనేయ స్వామి ఆలయ 12వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు నాగాభట్ల కిషోర్ సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో 24 గంటల పాటు ఏకాహ భజన కాలక్షేపం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నర్సింగ్ వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి



నర్సింగ్ విద్యార్థులకు సూచనలిస్తున్న వక్తలు

యానాం: నర్సింగ్ వృత్తిని ఎన్నుకుని శిక్షణ పొందుతున్న వారంతా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని కెరీర్ అండ్ గైడెన్స్ సెంటర్ ప్రతినిధి ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మదర్‌థెరిస్సా పోస్టు గ్రాడ్యుయేట్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌ను మెరుగుపర్చుకోవడం గురించి వివరించారు. హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ క్లాస్‌లో భాగంగా త్రిమూర్తులు మెడిటేషన్ గురించి వివరించారు.

రాజ్యాధికార యాత్రను విజయవంతం చేయాలి

ముమ్మిడివరం: బహుజన సమాజ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొక్కా పరంజ్యోతి ఈ నెల 26 నుంచి పాడేరు నియోజకవర్గం నుంచి ప్రారంభిస్తున్న బహుజన రాజ్యాధికార యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్ కాశి లక్ష్మీభవాని పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలో మంగళవారం జరిగిన బహుజన సమాజ పార్టీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఫిబ్రవరి 1న రాజ్యాధికారి యాత్ర కొత్తపేట అయినవిల్లి మీదుగా ముమ్మిడివరం చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

భావనఋషి జయంతి

యానాం: భద్రావతి సమేత భావన ఋషి జయంతిని పురస్కరించుకుని మంగళవారం గౌతమీగోదావరి తీరంలో కొలువైన భక్తమార్కేండేయుని సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. పూజా కార్యక్రమాల్లో పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు ఆదిమూలం కృష్ణ, ఒగ్గు ఋషి, సత్తిబాబు, ఆదిమూలం ఆదిబాబు, బి.ప్రసాద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది నిరసన

ముమ్మిడివరం: రాయచోటి జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిపై రాయచోటిలో దాడి చేయడాన్ని నిరసిస్తూ ముమ్మిడివరం ఐసీడీఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది మంగళవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నిరసనలో ఉద్యోగ సంఘ అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు, ,కేవీవీఎస్‌టీ కుమారి, ఎం .విజయగౌరి, సీహెచ్ పల్లవి, జీవీఎస్ఎన్ దేవి, జె.మీనాక్షి, ఎల్‌వీ రమణ పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయాలి

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీలో అనధికార లేఅవుట్లపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని కమిషనర్ జి.లోవరాజు పేర్కొన్నారు. 6వ వార్డు గంటా వీధిలో సర్వే నెంబర్ 932/1లో 1.88 ఎకరాల అనధికార లేఅవుట్‌ను గుర్తించామని చెప్పారు. ఆ లేఅవుట్ క్రమబద్ధీకరణకు అభ్యంతరాలుంటే 15 రోజుల్లో నగర పంచాయతీకి లిఖిత పూర్వకంగా లేదా మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. అనధికార లేఅవుట్‌ల్లో ప్లాట్లు కలిగిన యజమానులు రెగ్యులరైజ్ చేసుకోవడానికి టౌన్ ప్లానింగ్ అధికారిని సంప్రదించాలన్నారు.

సబ్‌ప్లాన్ కొనసాగింపు నిర్ణయంపై హర్షం

తాళ్లరేవు: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొస్తూ విడుదల చేసిన జీఓపై విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆర్డినెన్స్ అసెంబ్లీలో చట్ట రూపంలో తీసుకురావాలని, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వారికి మాత్రమే ఖర్చుచేయాలని, కేంద్ర ప్రభుత్వం సబ్‌ప్లాన్ చట్టబద్ధత కల్పిస్తూ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలన్నారు.

అభాగ్యులకు ఆపన్నహస్తం

- ఆశ్రయం లేనివారి కడుపు నింపుతోన్న బ్రహ్మార్పణ్ పథకం
- ప్రతి రోజు ఇంటి వద్దకే అందిస్తున్న భోజనం



అభాగ్యులకు ఇంటివద్దకే క్యారియర్ ద్వారా భోజనం అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు

తాళ్లరేవు: అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. అయితే ఒక్క పూటైనా ఆ అన్నం తినే అవకాశం లేక, సరైన ఇల్లు లేక, దీర్ఘకాలిక వ్యాధులతో, భోజనాలు వండి వడ్డించే దిక్కులేని స్థితిలో ఎంతోమంది అభాగ్యులు అవస్థలు పడుతుంటారు. అటువంటి వారికి మేలు చేయాలనే లక్ష్యంతో తాళ్లరేవు లయన్స్ క్లబ్ బ్రహ్మార్పణ్ అనే పథకానికి శ్రీకారం చుట్టింది. ఎటువంటి ఆశ్రయం లేని అభాగ్యులను గుర్తించి వారికి ఆపన్నహస్తం అందిస్తోంది. క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డికి వచ్చిన ఆలోచనను క్లబ్ సభ్యులతో చర్చించి తక్షణమే కార్యరూపంలోకి తీసుకొచ్చారు. ఇటీవల తాళ్లరేవు పర్యటనకు వచ్చిన లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మాటూరి మంగతాయారు పథకాన్ని ప్రారంభించారు. నాటి నుంచి ప్రతి రోజూ రెండు పూటలా ఆరుగురు అభాగ్యులకు ఇంటి వద్దకే భోజనం పంపిస్తూ వారి కడుపు నింపుతున్నారు. ప్రత్యేకంగా ఒక మనిషిని పెట్టి వంట చేయించడంతో పాటు వారికి స్వయంగా రిక్షాలో తీసుకెళ్లి అందిస్తున్నారు. దాతలు సహకారం అందిస్తే మరింత మందికి ఈ పథకాన్ని అమలు చేయాలని చూస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు చెబుతున్నారు.

అభాగ్యుల కడుపు నింపాలనే



ఎటువంటి ఆశ్రయం లేని అభాగ్యుల కడుపు నింపాలనే ఆలోచనతో పథకాన్ని ప్రారంభించాం. రోజూ వారి ఇంటికి తీసుకెళ్లి అన్నం పెట్టడమంటే వ్యయప్రయాసలతో కూడుకున్నా, అలాంటివారికి సేవ చేయాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నాం. మరింతమంది దాతలు ముందుకొస్తే పథకాన్ని విస్తరించాలనుకుంటున్నాం.
బి.శ్రీనివాసరెడ్డి, తాళ్లరేవు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు

దేవుడిలా ఆదుకుంటున్నారు



తల్లితండ్రులు లేకపోవడం, పెళ్లి చేసుకోకపోవడంతో పాటు దీర్ఘకాల వ్యాధులతో అనేక ఇబ్బందులు పడుతున్న నాకు లయన్స్ క్లబ్ సభ్యులు నన్ను దేవుడిలా ఆదుకుని కడుపు నింపుతున్నారు. నాకు సహకారం అందజేస్తున్న ప్రతి ఒక్కరికి చేతులెత్తి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.
– తాడి గంగాధరరావు, తాళ్లరేవు

ఆడ పిల్లలను కాపాడుకుందాం



ముమ్మిడివరంలో బాలికా దినోత్సవ వేడుకల్లో బాలబాలికలు



అమలాపురం సర్ సీవీ రామన్ స్కూలు ప్రాంగణంలో బాలిక ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన



యానాంలో జాతీయబాలికా దినోత్సవ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

అమలాపురం టౌన్: ఆడ పిల్లలను కాపాడుకుందామనే నినాదంతో స్థానిక సర్ సీవీ రామన్ స్కూలు ప్రాంగణంలో విద్యార్థులు బాలిక ఆకృతిలో కూర్చుని చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మంగళవారం స్కూలులో జరిగిన జాతీయ బాలికా దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు ఆడపిల్లను కాపాడుకుంటే సమాజాన్ని కాపాడుకున్నట్లేనని నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ముమ్మిడివరం: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు వి.శ్రీనివాస్ అధ్యక్షతన జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ మాట్లాడుతూ బాలికా సంరక్షణ, మహిళా సాధికారత సాధించినప్పుడే బాలికా దినోత్సవ లక్ష్యం నెరవేరుతుందన్నారు. స్థానిక యాపిల్ స్కూల్‌లో బాలికా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గోదశి పుండరీష్, ఎస్.అబ్బులు, ఎం.భ్రమరాంబ పాల్గొన్నారు.

యానాం: సమాజంలో బాలికల హక్కులను కాపాడే విధంగా అందరూ కృషి చేయాలని రీజెన్సీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్ అన్నారు. మంగళవారం జాతీయ బాలికాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు బాలురు, బాలికల విద్యకు సమాన ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సరెళ్ల వీరకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీహెచ్‌వో, ఎంపీహెచ్ఈవోల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర

అమలాపురం టౌన్: జిల్లా ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సీహెచ్‌వోలు, ఎంపీహెచ్ఈవోల అసోసియేషన్ 2023 సంవత్సరానికి ముద్రించిన డైరీని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర స్థానిక ఏరియా ఆస్పత్రిలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, సీహెచ్‌వో, ఎంపీహెచ్‌వో ప్రతినిధులు బుదిరెడ్డి అప్పారావు, సూర్యనారాయణ, డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం ఏవో కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై వృద్ధురాలి ఆవేదన



తన స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్న సూర్యకాంతం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లో ఉన్న చెరువుగట్టును ఆనుకుని ఉన్న తన స్థలాన్ని కొందరు ఆక్రమించుకుంటున్నారని కుడుపూడి సూర్యాకాంతం అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. సుమారు 30 ఏళ్లుగా నివాసముంటున్న తన పూరిపాక ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని, అదే సమయంలో కొందరు తన స్థలంలో గ్రావెల్ వేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. పాక నిర్మాణానికి డబ్బులు సమకూర్చుకుంటూ ప్రస్తుతం సమీపంలోనే మరో ఇంటిలో అద్దెకు ఉంటున్నానని ఆమె తెలిపింది. తాను భర్తను కోల్పోయానని, పిల్లలందరూ దూరమయ్యారని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

నిబంధనలకు లోబడే రీసర్వే జరగాలి

అమలాపురం రూరల్: ప్రస్తుతం జరుగుతున్న భూముల రీసర్వే విధానం సర్వే ఆఫ్ ఇండియా, ప్రభుత్వ నిబంధనలకు లోబడే జరగాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక ఈదరపల్లిలోని జనహిత భవనంలో సంఘ్ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం అధ్యక్షతన మంగళవారం జరిగిన రైతుల అఖిల పక్షం సమావేశంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. కొబ్బరి కాయలను నేరుగా రైతుల నుంచి బోడ కాయ రూపంలో కేజీ ఒక్కంటికి రూ.35 ఉండేలా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సమావేశంలో పాల్గొన్న అఖిల పక్షం ప్రతినిధులు పేర్కొన్నారు. వచ్చే ఫిబ్రవరి 20వ తేదీన కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో అఖిల పక్షం ద్వారా రైతు గర్జన పేరుతో ఉద్యమం చేయాలని సమావేశం తీర్మానించారు. పలు రైతు సంఘాల రైతు ప్రతినిధులు, నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

అమ్మాజీ మృతికి సంతాపం

యానాం: యానాం నియోజకవర్గానికి చెందిన నాయకుడు కాళ్ల ప్రసాద్ మాతృమూర్తి అమ్మాజీ ఆకస్మిక మృతికి మంగళవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమ్మాజీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి



స్టడీ మెటీరియల్‌ను అందజేసిన జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, ఎంపీపీ భాగ్యలక్ష్మి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న జెడ్పీటీసీ గౌతమి, ఎంపీపీ శేషగిరిరావు

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. జిల్లా పరిషత్ రూపొందించిన ఈ స్టడీ మెటీరియల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, స్థానిక కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మంచిగంటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్‌పర్సన్ చోడే సత్య భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం బాలికోన్నత పాఠశాలలో జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర, హెచ్ఎం ఎస్ఎల్‌వీ బాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అమలాపురం మండలం ఎ.వేమవరం, జనుపల్లి, కామనగరువు, వన్నెచింతలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబులు విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

అల్లవరం: పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యాభారతి స్టడీమెటీరియల్‌ను జెడ్పీటీసీ కొనుకు గౌతమి దేవగుప్తం, బోడసకుర్రు, కోడూరుపాడు, గోడి బాలురు, బాలికల గురుకుల పాఠశాలల్లో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. దేవగుప్తం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జెడ్పీటీసీ పరిశీలించారు. గోరుముద్ద పథకంలో ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రొక్కాల విజయలక్ష్మి, సుందరనీడి సాయి, తోట శ్రీదేవి, ఎంపీటీసీలు గుబ్బల రంగనాథస్వామి, కర్రి సత్య, కాంగ్రేగుల వాణి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండల పరిధిలోని గొల్లవిల్లి, భీమనపల్లి, మునిపల్లి, ఎస్.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు మంగళవారం జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ విద్యార్థులంతా స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు జొన్నాడ శ్రీదుర్గ, పెయ్యల రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, ఎంఈవో కె.కిరణ్‌బాబు, పీఎంసీ చైర్మన్‌లు దోనిపాటి రమావెంకటరమణ, సబ్బతి జ్యోతి, యర్రంశెట్టి నాగ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్ కృషితోనే పరిహారం మంజూరు



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ రైతులు

యానాం: ఓఎన్జీసీ గ్యాస్ పైపులైన్ల కారణంగా నష్టపోతున్న రైతులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేసిన కృషితోనే ఒక్కో రైతుకు రూ.2 లక్షల చొప్పున పరిహారం మంజూరైందని దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ రైతులు అన్నారు. మంగళవారం స్థానిక క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే అశోక్‌ను రైతులు ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొత్తం 191 ఎకరాల్లో పంట భూమికి మొదటివిడత 100 మందికి రూ.2 కోట్లు బాధిత రైతుల ఖాతాల్లో నేరుగా జమచేశారని చెప్పారు. సమస్యను ఓఎన్జీసీ అధికారులతో అనేక సార్లు చర్చించి పరిహార సాధన కోసం ఎమ్మెల్యే అశోక్ చేసిన కృషిని మరవలేమన్నారు.
ఆర్ఏఓ మునిస్వామిని సైతం రైతులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కోరుకొండ ఆనందరావు, డైరెక్టర్లు కోరుకొండ బాలయోగి, యాదాబత్తుల జగన్నాథం, నల్లా చంద్రరావు, సబ్బతి శ్రీనివాస్, గిడ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సచివాలయ కన్వీనర్ల నియామకం



ఈతకోట శ్రావణ్



చొల్లంగి సుబ్బరామ్

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం, రూరల్ మండలానికి వైఎస్సార్ సీపీ జగనన్న సచివాలయ పట్టణ, మండల కన్వీనర్లను నియమించారు. పట్టణ కన్వీనర్‌గా పార్టీ నాయకుడు ఈతకోట శ్రావణ్, మండల కన్వీనర్‌గా పేరూరు ఎంపీటీసీ సభ్యుడు, న్యాయవాది చొల్లంగి సుబ్బరామ్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఉత్తర్వుల పత్రాలు అందజేశారు. ఇటీవల అమలాపురంలో జరిగిన జిల్లా జగనన్న సచివాలయ కన్వీనర్ల సదస్సులో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర కోఆర్డినేటర్ పుత్తా ప్రతాపరెడ్డి, జిల్లా ఎమ్మెల్యేల సమక్షంలో కన్వీనర్లుగా శ్రావణ్, సుబ్బరామ్‌లు నియామక పత్రాలు అందుకున్నారు. తమ నియమాకానికి కృషి చేసిన మంత్రి పినిపే విశ్వరూప్‌కు శ్రావణ్, సుబ్బరామ్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

మహా సౌరయాగంలో పాల్గొన్న ఎంపీ



విలసవిల్లి రామాలయంలో ఎంపీ అనురాధకు వేదాశీర్వచనం అందజేస్తున్న పండితులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో రామాలయంలో జరుగుతున్న మహా సౌరయాగంలో మంగళవారం ఎంపీ చింతా అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురోహితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. యాగ కర్త ముమ్మంగి రామకృష్ణ శర్మ సౌరయాగం యొక్క విశిష్టతను ఎంపీ అనురాధకు వివరించి వేదాశీర్వచనం అందజేశారు. ఈ పూజల్లో అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి దంపతులు, వైఎస్సార్ ఉద్యానవన బోర్డు సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు సలాది ఊర్మిళా దేవి, జొన్నాడ శ్రీదుర్గ, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని రుంగ్తా ఇరిగేషన్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ మంగళవారం ఫ్యాక్టరీ మేనేజర్ రవిశంకర బెహరాకు డిమాండ్ నోటీస్ అందజేసినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ఆవరణలో ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలో 100 మంది కార్మికులు పనిచేస్తున్నారని, 20 ఏళ్ల సర్వీస్ ఉన్నప్పటికీ వారికి జీతాలు మాత్రం తక్కువగా ఉన్నాయన్నారు. 15 రోజుల్లో కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని లేదంటే పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుంచె సత్యనారాయణ, ఇళ్ల శ్రీనివాస్, కార్మికులు యు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతా మేలుకో.. డ్రగ్స్‌ను వదులుకో



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ శివరామరాజు

అమలాపురం రూరల్: యువతా మేలుకో.. డ్రగ్స్‌ను వదులుకో.. భవితను మలుచుకో... నినాదంతో భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో డ్రగ్స్ రహిత సమాజం కోసం తాలూకా పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు, తాలూకా ఎస్ఐ ఎ.పరదేశిలు సదస్సులో మట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌పై సమాచారం, సలహాలు, వ్యసన విముక్తి, పునరావాసం, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబరు 14500ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీవీసీ కళాశాల ఏవో జక్కం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3 నుంచి పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు

యానాం: ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 15వ పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి జె.దయాళన్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు సమాచారం అందింది. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు స్పీకర్ ఆర్.సెల్వం అధ్యక్షతన సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. ఆఖరి సమావేశం గతేడాది ఆగస్టు నెలలో జరిగింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సీఎం రంగసామి రూ.10,696 కోట్లతో బడ్జెట్‌ను సమర్పించారు.

27న రీజెన్సీ నేత మురళీ సంస్మరణ సభ

యానాం: రీజెన్సీ సిరామిక్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దివంగత మచ్చా మురళీ మోహన్ సంస్మరణ సభను ఈ నెల 27న యానాంలో నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకుడు విల్సన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ ఆఫీసు వెనుక ఉన్న అంబేడ్కర్ మున్సిపల్ కల్యాణ మండపంలో అదే రోజు ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి కార్మికులందరూ హాజరుకావాలని కోరారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

యానాం: 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25 బుధవారం నిర్వహిస్తున్నట్లు రీజినల్ అడ్మినిస్ట్రేటర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆర్.మునిస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి బూత్‌లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ సూపర్‌వైజర్లు, స్వీప్‌నోడల్ అధికారులు, నోడల్ అధికారులు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్బుల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

26న రైతు ట్రాక్టర్ల ర్యాలీలు

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు నిరసనగా ఈ నెల 26న ఆయా జిల్లాల కలెక్టరేట్ల వద్ద ట్రాక్టర్ల ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు జాతీయ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా శాఖ చైర్మన్ యాళ్ల బ్రహ్మానందం తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో మంగళవారం సాయంత్రం జరిగిన రైతు సంఘాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశంలో బ్రహ్మానందం మాట్లాడారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు డేగా ప్రభాకర్, రైతు పరిరక్షణ సమితి కన్వీనర్ కె.సత్తిబాబు, కో కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, మట్ట మహాలక్ష్మి ప్రభాకర్ పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

తాళ్లరేవు: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా రైతు సంఘాల సమాఖ్య తలపెట్టిన ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు కోరారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో పాలెపు ఈశ్వరరావు అధ్యక్షతన మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక హామీలిచ్చి ఏడాది గడుస్తున్నా అమలు జరగని కారణంగా ఈ నెల 26వ తేదీన ట్రాక్టర్ల ర్యాలీ చేయాలని దేశవ్యాప్త అఖిలభారత రైతు సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

వెంకాయమ్మ మృతి తీరని లోటు

అమలాపురం టౌన్: తాండవపల్లికి చెందిన సీపీఎం నాయకురాలు గుత్తుల వెంకాయమ్మ మృతి తీరని లోటని దళిత నాయకులు పేర్కొన్నారు. గ్రామంలో మంగళవారం జరిగిన వెంకాయమ్మ సంతాప సభలో దళిత నాయకులు మెండు రమేష్‌బాబు, పరమట శరత్‌బాబు మాట్లాడుతూ వెంకాయమ్మ కమ్యూనిస్ట్ నాయకురాలిగానే కాకుండా కూలీల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి పలుమార్లు జైలుకు సైతం వెళ్లారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బొంతు రవికుమార్, కుంచే రాము తదితరులు సంతాపం తెలిపారు.